క్లుప్తంగా

డిజిటల్ సర్వే సెంటర్‌ను పరిశీలించిన కమిషనర్


డిజిటల్ సర్వే సెంటర్‌ను పరిశీలిస్తున్న కమిషనర్

కుప్పం: కుప్పం నియోజకవర్గంలో టాటా సంస్థతో ఒప్పందం మేరకు నిర్వహిస్తున్న డిజిటల్ సర్వే సెంటర్‌ను ఫ్యామిలీ వెల్ఫేర్ సర్వీస్ కమిషనర్ వీరపాండియన్ పరిశీలించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనలో నేపథ్యంలో ఆయన దీనిని పరిశీలించారు. దీని ద్వారా ఏ విధంగా మెరుగైన వైద్య సదుపాయాలు అందుతాయో పర్యవేక్షించవచ్చని తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధులు బీపీ, షుగర్, గుండెజబ్బులు, క్యాన్సర్, థైరాయిడ్ వంటి వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవచ్చని ఆయన తెలిపారు. దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ సుధారాణి, వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ దేవి, డాక్టర్ పూజిత తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి


సమస్యలు నివేదిస్తున్న గ్రామస్తులు

సదుం: మండలంలోని ఎస్సీ కాలనీలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తహసీల్దార్ ప్రమీల అన్నారు. మండలంలోని మారుతివారిపల్లెలో సోమవారం పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. రాజ్యాంగం పౌరులకు కల్పించిన హక్కులను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. గ్రామ దారి ఆక్రమణ, శ్మశాన వాటిక, ఇళ్లపట్టాలు, రేషన్ కార్డుల సమస్యలను తహసీల్దార్‌కు నివేదించారు. ఆక్రమణలను గుర్తించి తొలగించేందుకు గ్రామంలో 2వ తేదీ సర్వే చేస్తామని తహసీల్దార్ వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ హరిబాబు, ఏఎస్ఐ సత్యనారాయణ, బాస్ నియోజకవర్గ ఆర్గనైజర్ సీతాపతి, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

గోశాలను ఏర్పాటు చేయరూ!

పుంగనూరు(చౌడేపల్లె): మూగజీవాల సంరక్షణ కోసం ప్రభుత్వం గోశాలను ఏర్పాటు చేయాలని అఖిల భారతీయ గోరక్ష మహాసంఘ్ జనరల్ ప్రధాన కార్యదర్శి అయూబ్‌ఖాన్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. పట్టణంలో ప్రతి రోజూ మూగజీవాలను కబేళాలకు తరలిస్తున్నారని, అక్రమ రవాణాకు అధికారులు చెక్ పెట్టాలన్నారు. అనంతరం తహసీల్దార్ రాముకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో నరసింహులు పాల్గొన్నారు.

సామాజిక సేవకులకు అవార్డులు


గ్రహీతలతో పుంగనూరు రోటరీ క్లబ్ సభ్యులు


పుంగనూరు (చౌడేపల్లె): సామాజిక సేవలను గుర్తించి, అవార్డులతో వారిని గౌరవిస్తున్నట్లు రోటరీక్లబ్ అధ్యక్షుడు ఆవుల హరిప్రసాద్ అన్నారు. సోమవారం పుంగనూరులోని ఒక ఫంక్షన్ హాల్‌లో అవార్డుల గ్రహీతలను జ్ఞాపికలతో సన్మానించారు. ముఖ్యఅతిథిగా రోటరీ అసిస్టెంట్ గవర్నర్ సూర్యప్రకాష్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ, 2024–2025 సంవత్సరానికి గాను రోటరీక్లబ్ ద్వారా సామాజిక సేవల్లో ఉత్తమ సేవలందించిన వారిని గుర్తించి వివిధ రకాల అవార్డులను బెంగళూరు రోటరీక్లబ్ ద్వారా ప్రదానం చేసినట్లు చెప్పారు. రోటరీ క్లబ్ సభ్యులు సేవా కార్యక్రమాల్లో మరింత చురుగ్గా పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ సభ్యులు భాస్కర్‌రెడ్డి, సీఎస్.రాజారెడ్డి, డాక్టర్ శరణ్‌కుమార్, భాస్కర్‌శెట్టి, నానబాల గణేష్, అనిల్, పూల త్యాగరాజు, ఎస్వీ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

• మళ్లీ గజ.. గజ

• పంటలపై ఏనుగుల దాడి • మామిడి తోటలకు నష్టం • రాతి కూసాలు ధ్వంసం


అడవిలో నుంచి పొలాల్లోకి వస్తున్న ఏనుగులు


ఏనుగులు కూల్చేసిన కొబ్బరి చెట్టు


ఏనుగులు ధ్వంసం చేసిన పొలం చుట్టూ ఉన్న కమ్మి రాతికూసాలు

పులిచెర్ల(కల్లూరు): కొన్ని నెలలుగా మండలంలో ఏనుగుల బెడద రైతన్నలకు కంటికి కునుకులేకుండా చేస్తోంది. మండలంలో నిత్యం ఏదో ఒక ప్రాంతంలో పంటలపై ఏనుగులు దాడులు చేయడం పరిపాటిగా మారింది. సోమవారం తెల్లవారుజామున పాళెం పంచాయతీలో ఏనుగుల గుంపు పంటపై దాడి చేసి నష్టం కలిగించాయి. పాళెం సమీప అటవీ ప్రాంతంలోనే తిష్ట వేసిన 14 ఏనుగులు జూపల్లె, కోటపల్లె గ్రామ రైతుల మామిడితోటల్లో పడి చెట్ల కొమ్మలను విరిచేశాయి. పొలం చుట్టూ ఉన్న కూసాలు నాటి వేసిన ఇనుప తీగల కంచెను ధ్వంసం చేసి, కూసాలను విరిచేశాయి. అలాగే కొబ్బరి చెట్లను ధ్వంసం చేసాయి. చీకటి పడితే చాలు పొలాలపై దండెత్తున్నాయి. వీటి దెబ్బకు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు రాత్రి పూట ఇళ్ల నుంచి నుంచి బయటకు రావడానికి హడలిపోతున్నారు.

వారాహి నవరాత్రులు


ప్రత్యేక అలంకరణలో దుర్గమ్మ

పలమనేరు: స్థానిక పాతపేటలోని కనక దుర్గాదేవి ఆలయంలో ఆషాఢ గుప్త దేవీ నవరాత్రుల్లో భాగంగా సోమవారం అమ్మవారు వారాహీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. జూలై 4వ తేదీ వరకు నవరాత్రులు నిర్వహిస్తామని నిర్వాహకులు రమణ, నాగరాజు, యువరాజు తెలిపారు. వారాహి హోమానికి పెద్దసంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

ఏఎస్ఓలకు ఉద్యోగ విరమణ సన్మానం


ఏఎస్ఓలను సన్మానిస్తున్న వివిధ ప్రాంతాల సహచరులు


పుంగనూరులో ఉద్యోగ విరమణ పొందిన రాజశేఖర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

రొంపిచెర్ల: చిత్తూరు జిల్లా ముఖ్య ప్రణాళిక కార్యాలయ పరిధిలో పని చేస్తూ ఉద్యోగ విరమణ పొందిన ఇద్దరు ఏఎస్ఓలను సీపీఓ కార్యాలయంలో సోమవారం ఘనంగా సన్మానించారు. రొంపిచెర్ల ఏఎస్ఓ రాజేశ్వరి, సీపీఓ కార్యాలయంలో పని చేస్తున్న ఏఎస్ఓ జగదీశ్వరి ఉద్యోగ విరమణ పురస్కరించుకుని సోమవారం జిల్లా కేంద్రంలో సన్మానించారు. జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి సాంబశివారెడ్డి మాట్లాడుతూ, ఏఎస్ఓలిద్దరూ తమ సర్వీసులో ఎలాంటి మచ్చ లేకుండా పని చేశారని వారి సేవలను ప్రస్తుతించారు. వీరిని ఆదర్శంగా తీసుకోవాలని ఇతర ఉద్యోగులు పనిచేసి శాఖకు పేరు తేవాలని కోరారు. అనంతరం పూలమాలలు, శాలువలతో వారిని సన్మానించారు. కార్యక్రమంలో ఏఎస్ఓలు రాంమోహన్, కుసుమ కుమారి, విజయకుమారి, సోమశేఖర్ రెడ్డి, నీరజ తదితరులు పాల్గొన్నారు.

పుంగనూరులో ప్రిన్సిపాల్‌కు..

పుంగనూరు(చౌడేపల్లె): ఉద్యోగ విరమణ కూడా ఒక వరంలాంటిదేనని శుభారాం ట్రస్ట్ చైర్మన్ సన్నుతిసాయి శ్రీనివాసమూర్తి అన్నారు. సోమవారం స్థానిక శుభారాం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వై.రాజశేఖర్ ఉద్యోగ విరమణ పురస్కరించుకుని ఘనంగా సన్మానించారు. ట్రస్ట్ చైర్మన్ మాట్లాడారు. ఉద్యోగులు విరమణ అనంతరం సామాజిక సేవలు అందించే దిశగా దృష్టి సారించాలని కోరారు. కళాశాల అభివృద్ధి, విద్యార్థుల ఉజ్వల భవితకు ప్రిన్సిపాల్ ఎనలేని సేవలు అందించారని ప్రస్తుతించారు. అనంతరం రాజశేఖర్‌ను సన్మానించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, చంద్రశేఖర్, నరసింహులు, వెంకటకృష్ణయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

• మామిడి ఆశలు రాలి..!


మతుకువారిపల్లె వద్ద తోపులో నేల రాలిన మామిడి కాయలు

పులిచెర్ల(కల్లూరు): మామిడి కాయలకు ధర పడిపోవడంతో కూలీ ఖర్చులు కూడా గిట్టుబాటు కాని పరిస్థితులను మామిడి తోటల రైతన్నలను కుదేలు చేస్తోంది. మండీలకు ట్రాక్టర్లలో, బండ్లలో తరలించినా కొనే దిక్కు లేకపోవడంతో కాయలు కోయకుండా అలాగే వదిలేస్తున్నారు. మరోవైపు పక్వానికి వచ్చిన కాయలు నేలరాలుతున్నాయి. ఏ మామిడి తోపు చూసినా చెట్ల కింద కాయలు కుప్పలు కుప్పలుగా పడి ఉన్నాయి. ఇలాంటి పరిస్థితి కొన్ని దశాబ్దాలలో ఎన్నడూ ఎదుర్కోలేదని రైతన్నలు నిర్వేదంలో మునిగిపోయారు. ఇక చెట్ల కింద రాలిన కాయలు పురుగులు పట్టి కంపు కొడుతున్నాయి.

సమస్యలు పరిష్కరించి ఆదుకోండి


సమ్మె చేస్తున్న మున్సిపల్ కార్మికులకు సంఘీభావం ప్రకటిస్తున్న ముస్లిం యూత్ నాయకులు

పుంగనూరు (చౌడేపల్లె): కనీస వేతనాలు ఇవ్వడంతో పాటు సంక్షేమ పథకాల్లోనూ లబ్ధి పొందేలా చర్యలు తీసుకోవాలని ముస్లిం యూత్ నాయకులు ఇర్ఫాన్, బాబుల్లి , రిజ్వాన్ కోరారు. మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె సోమవారం 17వ రోజుకు చేరుకుంది. వారికి ముస్లిం యూత్ సభ్యులు సంఘీభావం తెలిపారు. కార్మికుల సమస్యలపై కూటమి ప్రభుత్వం స్పందించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ ఉద్యోగస్తులు సమ్మె చేస్తే వెంటనే స్పందించే ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల విషయంలో ఉదాసీనంగా వ్యవహరించడం సరికాదన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీరాములు, కార్మికులు కుమార్, గోపి, దౌలత్, సంతోష్, శివకుమార్, మోహన్, సోము, వెంకట్రమణ, యూసుఫ్, జవహర్ అలీ, పద్మ, భాను, శైలజ తదితరులు పాల్గొన్నారు.

రూ.15 లక్షలతో సీసీ రోడ్లు


ఇందిరమ్మ కాలనీలో వీధులను చదును చేస్తున్న జేసీబీ

రొంపిచెర్ల: రొంపిచెర్ల గ్రామ పంచాయతీలోని ఇందిరమ్మ కాలనీలో రూ.15 లక్షలతో సీసీ రోడ్లు వేయనున్నట్లు రొంపిచెర్ల–1 సచివాలయ ఇంజనీర్ రెడ్డిప్రసన్న తెలిపారు. ఆమె సోమవారం ఇందిరమ్మ కాలనీ వీధుల్లో సీసీ రోడ్లు వేసేందుకు జేసీబీతో చదును చేయించారు. ఇక్కడ నాలుగు వీధుల్లో (400 మీటర్లు) త్వరలోనే సీసీ రోడ్లు వేస్తామని, దీనికిగాను సర్పంచ్ ఇబ్రహీంఖాన్ ఉపాధి హామీ పథకంలో సీసీ రోడ్లు మంజూరు చేయించారని తెలిపారు.

ఆక్రమణల నుంచి ప్రభుత్వ ఆస్తులకు
విముక్తి కల్పించండి


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ రాము

పుంగనూరు(చౌడేపల్లె): కోట్లాది రూపాయల విలువ చేసే ప్రభుత్వ ఆస్తులను ఆక్రమణదారుల చెర నుంచి విముక్తి కల్పించాలని ఎస్సీ,ఎస్టీ మానటరింగ్ కమిటి సభ్యులు ఎన్ఆర్.అశోక్ , నరసింహులు కోరారు. సోమవారం పుంగనూరు తహసీల్దార్ రాము తన కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. దళిత నాయకుడు యమలా సుదర్శన్ మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ప్రభుత్వం కేటాయించిన నిధులతో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. శ్మశానవాటికలకు స్థలాలను కేటాయించాలని కోరారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో అనాధీనంగా ఉన్న భూములను గుర్తించి ఎస్సీ, ఎస్టీల్లోని అర్హులకు ఇంటి పట్టాలను మంజూరు చేయాలని కోరారు. కమిటీ సభ్యుడు ఎన్ఆర్.అశోక్ మాట్లాడుతూ, మండలంలో చెరువులు, ప్రభుత్వ భూములను యథేచ్ఛగా ఆక్రమిస్తున్నారని, అధికారులు ఆక్రమణదారులకు సహకరిస్తున్నారని ఆరోపించారు.పట్టణంలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని, దీనికి అడ్డుకట్ట వేసే దిశా చర్యలు తీసుకోవాలని కోరారు. రాయితీ రుణాల మంజూరులో ఎస్సీ ఎస్టీ ప్రాధాన్యత కల్పించాలని డిమాండు చేశారు. కమిటీ సభ్యులు ప్రస్తావించిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈఈ మహేష్, సీఐ సుబ్బరాయుడు, సీడీపీఓ రాజేశ్వరి, నాయకులు రామయ్య, ఎం నరసింహులు, శంకరప్ప, చిన్నప్ప, వెంకట్రమణ, బి.నరసింహులు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ఆక్రమణపై ధర్నా


రోడ్డుపై ధర్నా చేస్తున్న గ్రామస్తులు

• గ్రామాలకు దారి లేకుండా చేశారని మండిపాటు
• పోలీసుల జోక్యంతో సమస్య పరిష్కారం

గంగవరం: తమ గ్రామాలకు వెళ్లే రోడ్డును ఇద్దరు వ్యక్తులు ఆక్రమించడంతో రెండు గ్రామాల ప్రజలు సోమవారం మేలుమాయి క్రాస్ వద్ద ఆందోళన చేశారు. తమ గ్రామాలకు దారి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. గ్రామస్తులు మాట్లాడుతూ, మేలుమాయి పంచాయతీ గుండ్లపల్లె, కొత్తూరు గ్రామాలకు ఉన్న 20 అడుగుల వెడల్పు కలిగిన రోడ్డుని ఇద్దరు భూ యజమానులు ఇరువైపులా ఆక్రమించి అడ్డంగా రాతి కూసాలు నాటడడంతో రాకపోకలు సాగించలేని పరిస్థితి కలిగిందని మండిపడ్డారు. వీరి మూలాన మేలుమాయి నుంచి ఆ గ్రామాలకు వెళ్లాలంటే దాదాపు 4 కిలోమీటర్లు కాలినడకన వెళ్లాల్సి వస్తోందన్నారు. గతంలో ఆక్రమణపై తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో గత్యంతరం లేక ధర్నాకు దిగామన్నారు. సమాచారం అందుకున్న గంగవరం అర్బన్ సీఐ ప్రసాద్, పోలీసులు, రెవెన్యూ సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. ఆందోళనకారులతో చర్చించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని శాంతింపజేశారు. అనంతరం ఆక్రమణకు గురైన దారిని పరిశీలించారు. ఆక్రమణదారులతో మాట్లాడారు. ఎట్టకేలకు రోడ్డుపై నాటిన రాతి కూసాలను తొలగించారు.


రోడ్డుపై ఆక్రమణదారులు నాటిన రాతి కూసాలు


పోలీసు, రెవెన్యూ సిబ్బంది జోక్యంతో రోడ్డుపై రాతి బండలు తొలగించిన దృశ్యం

ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే చట్టరీత్యా చర్యలు

• సమ్మె చేస్తున్న ఉద్యోగులకు కమిషనర్ వార్నింగ్


ఉద్యోగ సంఘ నాయకులతో మాట్లాడుతున్న కమిషనర్

చిత్తూరు అర్బన్: నగరంలో వీధి దీపాలను ఆఫ్ చేయడం, నీటి సరఫరా జరగకుండా అడ్డుకోవడం లాంటి చర్యలకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తప్పవని చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ నరసింహ ప్రసాద్ హెచ్చరించారు. వారం రోజులుగా సమ్మె చేస్తున్న ఇంజినీరింగ్ విభాగం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతో సోమవారం చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ సమావేశమయ్యారు. ఉద్యోగులు సమ్మె చేసుకుంటే తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, అయితే ప్రజల ప్రాథమిక అవసరాలకు భంగం కలిగిస్తే చర్యలు తప్పవని ఉద్యోగులను హెచ్చరించారు. వీధి దీపాల నిర్వహణ, నీటి సరఫరా బాధ్యతలను సచివాలయ కార్యదర్శులకు అప్పగిస్తామని ప్రకటించారు. సమావేశంలో మునిసిపల్ ఇంజినీర్ వెంకటరామిరెడ్డి, వన్ టౌన్ సీఐ మహేశ్వర, ఇతర అధికారులు పాల్గొన్నారు.